మరోసారి వైసీపీ విజయం ఖాయం

విశాలాంధ్ర - అనపర్తి : మరోసారి వైసీపీ రాష్ట్రంలో విజయం సాధించడ ఖాయమని ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గెలుపుకు ఢోకా లేదని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు పంపన రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక గంగిరెడ్డి నర్సింగ్ హోం ఆవరణలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని పద్మశాలి సంఘం నేతలు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి గత ఐదేళ్లలో ఎమ్మెల్యే సత్తి ఎంతో కృషి చేశారని మరోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమంటూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం కోఆర్డినేటర్ పెనుగొండ శ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత కార్యదర్శి పప్పు సింహాచలం, తేలు శ్రీను, శంకర్ బాబు, ఉమా భవాని,ఉదత రాజు, ఎం శ్రీను తదితరులు ఉన్నారు.

ఎన్డీయేదే అధికారం

విశాలాంధ్ర - అనపర్తి : సార్వత్రిక ఎన్నికల లెక్కింపులో ఇరవై వేల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఎన్డిఏ కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బిక్కవోలు గ్రామ బిజెపి,టిడిపి, జనసేన నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లమిల్లి మాట్లాడుతూ దాదాపు 145 సీట్లతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలవనుందని దేశంలో కూడా ఎన్డీఏ కూటమే అధికార చేపట్టనుందని చెప్పారు. పోలింగ్ ముగిసేవరకు నా విజయం కోసం సైనికుల్లా పని చేసిన బిజెపి, టిడిపి, జనసేన శ్రేణులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని రామకృష్ణారెడ్డి అన్నారు.

రాజ్యాంగం మార్చే దమ్ము బీజేపీకి లేదు: బొంతా

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్: భారత రాజ్యాంగం మార్చే అంత దమ్ము బీజేపీకి లేదని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు అభ్యర్థి బొంతా శ్యామ్ రవిప్రకాష్ పేర్కొన్నారు. బీజేపీకి 250 సీట్లు కూడా రావని రాజ్యాంగం మార్చాలంటే 363సీట్లు ఒకేపార్టీకి రావాలని తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే స్విస్ బ్యాంకు నుండి నల్లధనం వెన్నక్కి తీసుకొస్తానని చెప్పిన మోడీ దేశప్రజల్ని మోసం చేసారని కరోనా సమయంలో అనాలోచిత నిర్ణయంతో అనేక మంది దినసారి కార్మికుల మరణానికి కారణం అయ్యారని తెలిపారు. ప్రభుత్వం రంగసంస్థలైన స్టీల్ ప్లాంట్ రైల్వే బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ పరం చేసి దేశ సంపాదన ప్రైవేట్ వ్యక్తులకు దోచి పెట్టాలనుకొవడం దుర్మార్గం అన్నారు. కేంద్రంలో ఖచ్చితంగా బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ ప్రజలకు భ్రమలు కల్పించి 400సీట్లు వస్తాయని చెప్పడం హ్యాస్యాస్పదం అన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : వైశాఖ మాసం ఏకాదశిని పురస్కరించుకుని గండేపల్లిలో కొలువై ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గండేపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవములు ఐదు రోజుల పాటు ప్రతీ ఏడాది నిర్వహిస్తారు. కళ్యాణం మహోత్సవంలో భాగంగా ఐదు రోజుల పాటు స్వామివారికి ఉదయం సాయంత్రం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని నేమాల అప్పారావు, రాఘవ దంపతులు పీటల మీద కూర్చుని జరిపించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో రఘుదేవపురం గ్రామ పరిధిలో అగ్రహారంలో వెలసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేద పండితులు సమక్షంలో శాస్త్రోతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి, అలివేలు మంగ, పద్మావతి సమేతంగా కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణం సుమారు 12 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం శాస్త్రోతంగా ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనిలో సుమారు 30 జంటలకు వరకు కూర్చుని కళ్యాణం చేశారు. ఈ కళ్యాణం జరిపించి కునే వారు సంప్రదాయ దుస్తులు ధరించి ఆహార నియమ నిబంధనలు పాటించి భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ కళ్యాణం చూడటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ కళ్యాణం తిలకించిన, జరిపించి కున్న వారికి మంచి జరుగుతుంది అని ఒక నమ్మకం ఉంది. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణం

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ల నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ళ శ్రీ వీరేశ్వర స్వామి వారి క్షేత్రపాలకులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కల్యాణం మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జంపన రామకృష్ణం రాజు దంపతులు చేతులు మీదుగా కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ నెల 19వ తేదీ నుండి 23వ తేది వరకు బ్రహ్మశ్రీ పాణంగిపల్లి సూర్యనారాయణ ఆచార్యులు బ్రహ్మత్వంలో పాంచాహ్నిక దీక్షతో జరుగుతున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందులోభాగంగా ఐదు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం అర్చక, పురోహితులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపయోగస్థితిలో బస్టాండ్లో బాత్రూమ్స్

విశాలాంధ్ర - నల్లజర్ల : గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్లో బాత్రూమ్స్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు కోసం వచ్చిన వారు బస్సులు ఆలస్యంతో గంటల తరబడి బస్టాండ్ ఆవరణలో కాలం గడుపుతున్నారు. అంతంత సేపు బస్టాండ్ లో ఉన్నవారికి బాత్రూమ్స్ చాలా అవసరం. బయటికి వెళ్లాలంటే చాలా దూరం వెళ్ళాలి బస్టాండ్లో బాత్రూమ్స్ నిరుపయోగ స్థితిలో ఉండిపోయాయి. కనీసం వాటిని పట్టించుకునే నాధుడే కరువైపోయాడు. రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి టిడిపి నాయకుడు మురళీమోహన్ వారి ప్రభుత్వంలో ఎంపీ నిధులతో నిర్మించిన ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కొన్ని నెలల తరబడి బస్టాండ్ ఆవరణలో ఉన్న బాత్రూమ్స్ శిథిలావస్థకు చేరాయి. ప్రయాణికులు బాత్రూమ్స్ లేక ఎవరికి చెప్పుకోవాలో తెలియక దీనస్థితిలో ఉంటున్నారు. టిడిపి ప్రభుత్వం వారు ఏ పని చేసినా పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని ప్రయాణికులు వారి ఆవేదన వ్యక్తపరిచారు. కనీసం బస్టాండ్లో కూర్చోవటానికి సరైన బెంచీలు లేవు ఉన్న బెంచీలు కూర్చుంటే పడిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు. కనీసం ఆ బాత్రూమ్స్ని కడగడానికి నీళ్లు పెట్టడానికి వాటిని శుభ్రపరచడానికి ఒక మనిషి లేడని ప్రయాణికులు మండిపడుతున్నారు. కనీసం వాటర్ బాటిల్ కొనుక్కోవడానికి బస్టాండ్ ఆవరణలో సరి అయిన షాప్ లేదని బస్టాండ్ ఆవరణలో చాలా ఇబ్బందులు ఉన్నాయని ప్రయాణికులు మీడియా ఎదుట వాపోయారు. అధికారులు స్పందించి తక్షణమే అక్కడున్న అసౌకర్యాలు అన్నీ కూడా సౌకర్యవంతరంగా చూడాలని, వెంటనే బాత్రూమ్స్ క్లీన్ చేపించాలని పోయిన సామాగ్రిని మరల పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. వెంటనే అక్కడ పని వారిని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు

ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఇటీవల సుప్రీం కోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వారు జారీ చేసిన ఆదేశాల మేరకు అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులు ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిధిలోని నార్కేడిమిల్లి గ్రామంలో ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక ర్యాంపు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. ర్యాంపుకు సంబంధించి సరిహద్దులను పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం రాంపులో ఎటువంటి ఇసుక ఆపరేషన్ లేవని, పోలీస్ అధికారులు రాత్రి సమయంలో అక్రమ ఇసుక తవ్వకాలకు ఎవరు పాల్పడకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. అదేవిధంగా స్థానికంగా నివసించేవారు తమ తమ గృహ నిర్మాణ అవసరాలకు ఇసుకను అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలోనూ తీసుకుని వెళ్లడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అక్రమ ఇసుక తవ్వకాలను నిలువరించాలనే సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు స్పష్టంగా ఉన్న దృష్ట్యా అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవ హరించాలన్నారు. సహజ పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు అందితే వెంటనే తగు చర్యలు గైకొని నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాలో పోలీసులు, వివిధ శాఖల అధికారులతో త్వరలో కమిటీ ఏర్పాటు చేసి ఎన్జీటీ తీర్పునకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు ఆపే బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించనున్నదన్నారు. ఈ కమిటీ క్రమం తప్పకుండా పర్యటించి అక్రమ తవ్వకాలు జరగకుండా పర్యవేక్షించనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు వెంకట రామయ్య, జలవనరుల శాఖ, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్ట రైతు కుదేల్..

విశాలాంధ్ర - జగ్గంపేట : మెట్ట ప్రాంతమైన జగ్గంపేట మండలంలోని మామిడి రైతులు కుదేల య్యారు. మెట్ట భూముల్లో ఈ ప్రాంత రైతులు మామిడి, జీడు మామిడి సాగు చేస్తుంటారు. జగ్గంపేట మండలంలో 2292 ఎకరాలు మామిడి సాగు ఉండగా, వాతావరణం మార్పులతో ఈ అది సగానికి పడిపోయింది. మండలంలోని రాజపూడి, గోవిందపురం, మల్లిసాల గ్రామాల్లో అధికంగా మామిడి తోటలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో ఉన్న మామిడి తోటలు చాలా వరకు పూత దశలోనే పాడయ్యాయి. కాయలు కాసిన చోట్ల ఊరగాయలు ఉపయోగపడే కొత్తపల్లి కొబ్బరి, హైదర్ సాహెబ్, రసాలు వంటి రకాల కాయలు తక్కువగా కాయడంతో కాసిన రైతుల పంట పండిందనుకున్నారు. అంతలోనే అకాల వర్షాలు గాలులు వచ్చాయి. కాయలు కాస్తా నేల రాలిపోయాయి. ఇక చెప్పేది ముంది దక్కినకాడికి దక్కించుకో అన్నట్లుగా తక్కువ ధరకు విక్రయాలు చేశారు. చెట్లు కాసిన చోట కలక్టర్ రకం కాసాయి. వాటిని కొన్ని రకాల ఉరగాయాలకు ఉపయోగిస్తారు. ఆలాగే మామిడి తాండ్ర తయారు చేసేందుకు ఈ రకాన్ని ఉపయోగిస్తారు. ఈ రకం మిగిలిన రకాలు పూర్తయ్యాక కోత దశకు వస్తాయి. వాతావరణం ఎలా ఉంటుందోనని భయాందోళనలతో రైతులు కాయ పూర్తిగా తయారు కాకుండానే కొస్తున్నారు. ప్రస్తుతం వీటిని కోసి తాండ్ర తయారు చేసే ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్నారు. ఆలాగే రెండో దశలో కాసిన బంగిరిపల్లి, రసాలు వంటి రకాలు ఇప్పుడు పండ్లు తయారయ్యే దశకు చేరుకున్నాయి. గత 10 రోజులుగా క్రితం పడిన వర్షానికి బంగిరిపల్లి రకానికి మచ్చ వస్తుంది. పురుగు పట్టి పండ్లు రాలిపోతున్నాయని రైతులు అవేదన చెందుతున్నారు. ఎండ, వర్షం ఉన్న నేపథ్యంలో మామిడి కాయలకు నష్టం వాటిల్లుతుందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

శిక్షణా తరగతులు వాయిదా వేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర - రాజానగరం : సీబీఎస్ఈ సిలబస్ పేరుతో వేసవి సెలవులలో శిక్షణ తరగతులు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, వాటిని తక్షణమే వాయిదా వేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టియు)రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గైట్ కళాశాలలో రెండు రోజులు పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణా తరగతులు అనంతరం పత్రిక ప్రకటనను శనివారం రాత్రి విడుదల చేశారు. ఎస్టియు రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ వెకేషన్ డిపార్ట్మెం ట్ విభాగమైన విద్యాశాఖలోని ఉపాధ్యాయులను వెకేషన్ నుండి దూరం చేసే శిక్షణా తరగతులను వాయిదా వేయాలన్నారు. వెకేషన్ కాలంలో ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు ఏళ్లు కాలంలో పాఠశాల నిర్వహణ నిధులు క్రమంగా కేటాయించడం లేదని, ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాల గ్రాంట్లు విడుదల అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వంట ఏజెన్సీలకు కుకింగ్ చార్జీలు పెంచాలనీ కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ దినోత్సవం చక్కని సందేశం

విశాలాంధ్ర - నల్లజర్ల: సమగ్ర ఆరోగ్య సంరక్షణ.. సమాజ శ్రేయస్సులో కుటుంబ వైద్యుల కీలక పాత్రను, సేవలను గౌరవించడమే లక్ష్యంగా ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్స్ డే నిర్వహిస్తున్నారని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజ్ ఉద్దీన్ అన్నారు. ఏటా మే 9 న జరిపే ఈ కార్యక్రమం గురించి వైద్యులు ఆదివారం పత్రికల వారికి వివరించారు. తొంబై శాతం ఆరోగ్య సమస్యలను సరైన ప్రాథమిక వైద్య సేవల ద్వారా గుర్తించి సకాలంలో చికిత్స చేస్తే ఆసుపత్రిలో చేరకుండానే నయమవుతాయని వారు అభిప్రాయపడ్డారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి వైద్యులు ఉండటం, ఒకరు పి.హెచ్.సి లో వైద్య సేవలు అందిస్తుంటే మరో వైద్యులు గ్రామాల్లో వున్నా హెల్త్ క్లినిక్స్ కెళ్ళి ఆ ప్రాంత గ్రామీణులకు 15 రోజులుకోసారి నేరుగా వైద్య సేవలను అందించడం అద్భుతమైన విషయమన్నారు. అధునాతన వైద్య పరికరాలున్నా 104 వాహనం సైతం గ్రామాలకు రావడంతో పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. మనిషికి జీవితాన్నిచ్చే ఆరోగ్య సేవలను ఎంతో అంకితభావంతో చేస్తున్నా వైద్యులందరికీ ఫ్యామిలీ డాక్టర్ దినోత్సవం ఒక చక్కని సందేశమని వైద్యులు డాక్టర్ గంగాధరరావు, సిరాజ్ ఉద్దీన్ పేర్కొన్నారు.

త్వరలోనే రాక్షస పాలన నుంచి విముక్తి

విశాలాంధ్ర - కాకినాడ : త్వరలోనే రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించనుందని ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో రామరాజ్యం ప్రజలకు చేరువ కానుందని టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కాకినాడ జిల్లా పరిధిలోని తుని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజాలను వారి స్వగృహాల్లో విడివిడిగా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ట్రెండ్ను బట్టి చూస్తే రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబును కోరుకుంటున్నారని, ఆయన మేనిఫెస్టోను జనం నమ్ముతున్నారని, రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. తునిలో, ప్రత్తిపాడులో విజయం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు యనమల దివ్య, వరుపుల సత్యప్రభరాజాలకు దక్కడం ఖాయమన్నారు. బిక్కిన సత్తిబాబు, కొప్పిశెట్టి నాగబాబు, కొప్పిశెట్టి సాయి, దమ్ము నూకరాజు, మల్లంపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-పెరవలి: ఉసులుమర్రు ఇసుక ర్యాంపును జిల్లా కలెక్టర్ మాధవి లత ఆదివారం పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలు చేసిన ప్రాంతం కోనసీమ జిల్లా పరిధిలోకి వస్తుందని ఉసులుమర్రు తీపర్రు ర్యాంపులో బాట వేసి ఇసుక తరలిస్తున్నారు అని తెలిపారు.ఇసుక తవ్వకాలు గతంలోనే నిలుపుదల చేశారు.ప్రస్తుతం ఎటువంటి ఇసుక తవ్వకాలు చేయరాదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశితోష్ శ్రీ వాత్స మైనింగ్ ఏడి సుబ్రహ్మణ్యం తాసిల్దార్ సుధా ఎస్సై మూర్తి సర్వేర్ గోపాలకృష్ణ రెవిన్యూ అధికారి పావని ఇరిగేషన్ అధికారులు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసాలలో పెట్రోలు అమ్మకాలు నిషేధం

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు - 2024 అనంతరం పరిణామాలలో జరుగుతున్న ఘర్షణలు, అల్లర్లు, హింసాయుత సంఘటనలను దృష్టిలో పెట్టుకొని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల ఆదేశాల మేరకు, మండలంలో అన్ని పెట్రోల్, డీజిల్ బంకులలో విడిగా టిన్నులు, డ్రమ్ములు, బాటిల్స్ లలో పెట్రోల్ అమ్మకాలు పూర్తిగా నిషేధించడం జరిగిందని ఉంగ్రాజవరం ఎస్సై వి అప్పలరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంకుల యాజమాన్యం జిల్లా అధికారుల ఉత్తర్వులు తూ.చ.తప్పకుండా పాటించాలని కోరారు. ఉత్తర్వుల ఉల్లంఘన జరిగితే వెంటనే బంకుల లైసెన్స్ లుకూడా రద్దు చేయబడతాయని హెచ్చరించారు. మండల ప్రజలు, సామజిక కార్యకర్తలు ఎవరైనా పైన చెప్పిన నిభందనలను ఉల్లంఘించిన వారి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణతోనే మనుగడ సాధ్యం

విశాలాంధ్ర - కాకినాడ : జీవవైవిధ్య పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ సంచాలకులు డాక్టర్ కెవిఎస్జి మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి, వృక్ష శాస్త్ర విభాగం పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు ఆదివారం స్థానిక పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా నాలుగో తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలో ఉన్న 52 పాఠశాలలు కళాశాలలు నుండి 273 మంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన జీవ వైవిధ్య అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా జేఎన్టీయూ ప్రముఖ డాక్టర్ కెవిఎస్జి మురళీకృష్ణ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. భారతదేశం జీవ వైవిధ్య పరంగా అతి బలమైన దేశమని, ఇది ప్రపంచ దేశాలతో పోలిస్తే 17వ స్థానంలో ఉన్నదని తెలిపారు. ఇక్కడ సుమారు 1200 పక్షి జాతులు, వివిధ జంతువులు ఉన్నాయన్నారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై శివ ప్రసాద్ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిధ్యానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకం తగ్గించి వృక్షజాతులు పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ఎన్ వీరభద్రరావు, విఎస్వి రమణ మూర్తి, పిల్లి గోవిందరాజులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక మాంద్యంతో కాకినాడ అభివృద్ధి స్థంభించింది

పౌర సంక్షేమ సంఘం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగర పాలక సంస్థ గతంలో ఎన్నడూ లేనిరీతిగా ఆర్థిక ప్రతిష్టంభనకు గురయ్యిందని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. ఇందువలననే నగరంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. స్మార్ట్ సిటీ పథకం నుండి రు.250 కోట్లు బకాయి పడగా ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రు.60కోట్లు పెండింగ్ ప్రభుత్వ శాఖలు వెచ్చించుకున్న జనరల్ నిధులు రు.75 కోట్లు కాంట్రాక్టర్ల బకాయిలు రు.50కోట్లు చెత్త పన్ను మెయింటినెన్స్ భారాలు రు.2కోట్లు గ్రంథాలయ పన్ను బకాయి రు.3కోట్లు వసూళ్ళు కాని ఆస్తి పన్ను రు.10కోట్లు కాంట్రాక్ట్ పెండింగ్ జీతాల బకాయి రు.2 కోట్లు కమాండింగ్ సెంటర్ బకాయి రు.20 కోట్లు వెరసి రు.500కోట్ల రూపాయల ఆర్థిక మాంద్యంతో వుందని పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్ల పూడి రమణరాజు పేర్కొన్నారు. నగరంలో తారు రోడ్లు శిథిలావస్థకు చేరాయన్నారు. ముంపు నివారణకు తగిన డ్రెయిన్లు కల్వర్టుల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. దోమల నివారణకు క్రిమిసంహారక మందులు పూడిక తీత పనులు జరగడం లేదన్నారు. వీధి దీపాల నిర్వహణ కాంట్రాక్ట్ చేయకుండా ఎఇ సూపర్ వైజర్ నిర్వహణకు వదిలేసారన్నారు. ఖాళీస్థలాల్లో ఉప్పుటేరులో డంపింగ్ జరుగుతున్నదన్నారు. కార్పోరేషన్ కార్యాలయ భవన నిర్మాణం అమావాస్య చందంగా తయారయ్యిందన్నారు. కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలబకాయి పెరిగిందన్నారు. కార్పోరేషన్కు ఆదాయవనరులు తగ్గిపోయి జనరల్ నిధులు దుబారాకు గురయ్యాయన్నారు. జూన్ 4 ఎన్నికల ఫలితాలనంతరం కార్పో రేషన్ సమీక్షా సమావేశాన్ని స్పెషల్ ఆఫీసర్ చేపట్టాలని కోరారు. 2024-25 బడ్జెట్ గోప్యంగా ఉంచడం వలన వాస్తవాలు మరుగున పడ్డాయన్నారు. రానున్న వర్షాల్లో ఎగువ నుండి వచ్చే వరదల బెడద తీవ్రంగా వుండే అవకాశం ఉన్నందున ముంపు నివారణకు రెవిన్యూ ఏలేరు నీటి పారుదల పిడబ్ల్యూడి కుడా శాఖాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పౌర సంఘం కోరింది.

పుచ్చలపల్లి ఆశయాలు ఆదర్శనీయం..

విశాలాంధ్ర - అమలాపురం : స్వాతంత్ర్య సమరయోధుడు దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారధి భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్షనేత, త్యాగశీలి, ఆదర్శమూర్తి మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సభకు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు అంగ్రా మాల్యాద్రి హజరై మాట్లాడుతూ సుందరయ్య జీవిత ఆశయాలను మనం అందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భూస్వామ్య కుటుం బంలో పుట్టి తన యావదాస్తిని ప్రజలకోసం ప్రజా ఉద్యమాలకోసం త్యాగం చేసారని గుర్తు చేసారు. పిల్లలు పుడితే ప్రజా ఉద్యమాలకు ఆటంకంగా ఉంటారనే ఆలోచనతో పిల్లలను వద్దనుకున్న మహనీయుడు సుందరయ్య అని గుర్తు చేసారు. నేడు దేశాన్ని పరిపాలన చేస్తున్న బిజెపి దేశాన్ని కార్పోరేట్ కంపెనీలకు దొచి పెడుతుందని అన్నారు. మరోప్రక మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలమధ్య వైషమ్యాలను రెచ్చకొడుతూ కార్పొరేట్లకు బిజేపీ దొచిపెడుతుందని వాపోయారు. ఆంధ్రప్రదేశ్లో జరిగిన ఎన్నికల్లో పోటీ పడుతూ ప్రజలకు వరాలను సంక్షేమ పదకాలు అమలు చేస్తామని హామీలు గుప్పించారే తప్ప ఉపాది కల్పనకోసం ఏచర్యలు చేస్తారో ప్రజలకు టిడిపి, వైసిపి, జీజేపీలు చేప్పలేదని ఆయన వాపోయారు. బిజేపీ మతోన్మాద విదానాలపై సుందరయ్య చూపిన మార్గంలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి దుర్గాప్రసాద్, పీతల రామ చంద్రరావు, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, తాడి శ్రీరామ మూర్తి, కెవి సత్యనారాయణ, తాళ్ళూరి శ్రీనివాసరావు, విప్పర్తి మోహన్ రావు, కే శంకర్, పర్వతాలు, జగడం నాగేశ్వరరావు, కే సత్తి బాబు, సిహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

రైతులను నిరాశపరిచిన మామిడి దిగుబడులు

విశాలాంధ్ర - సీతానగరం/ రాజానగరం: రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా గల సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో సుమారు ఐదు వేల హెక్టార్లలో మామిడి తోటలు రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మామిడి పూత సమయంలో గాలులతో కూడిన వర్షం కురవడంతో తోటల దిగుబడి ఒక్కసారిగా తగ్గి పోయింది. కొన్ని తోటల్లో చెట్టుకి 10 నుండి 15 కాయలు మాత్రమే కాసాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకో ఎకరాకు సుమారు 10 నుండి 20 వేల రూపాయల వివిధ రకాల మందులు వాడారని కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఇక చిత్తుకి తీసుకొన్న రైతులు అయితే కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలాగా ఉండగా ప్రస్తుత బహిరంగ మార్కెట్లో మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంది. దీని వల్ల కొంత మంది రైతులు అయిన నష్టాల భారీ నుండి బయట పడే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. దీనిపై అధికారులుతగిన సూచనలు సలహాలు ఇచ్చి నష్టాల భారీ నుండి బయట పడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్కు దారేది..!

విశాలాంధ్ర - జగ్గంపేట : నిత్యం రద్దీగా ఉండే జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ బురదతో దర్శనమిస్తుంది. రోజుకి వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణించే ఆర్టీసీ కాంప్లెక్స్లోకి వెళ్ళేందుకు కనీసం దారి లేదు. కొద్దిపాటి వర్షం వస్తే చాలు ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. బస్సుల కోసం వెళుతూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఆలాగే కాంప్లెక్స్ నుండి బస్సులు బయటకి వెళ్లే మార్గంలో పెద్ద గుంట ఏర్పడటంతో బస్సులు ఆ గుంతల్లో పడి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్ ఆవరణం ద్వారా ఆదాయం కోసం ప్రయత్నించే అధికారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదనే అరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధి హామీలో శ్రమ దోపిడీ

విశాలాంధ్ర - గండేపల్లి : పేద కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెడితే అది కాస్తా దోపిడీకి గురవుతుంది. వేసవి కాలంలో చెరువుల్లో నీరు తగ్గుతుంది. అటువంటి చెరువుల్లో లోతును పెంచేందుకు ఉపాధి హామీ ద్వారా పనులు చేస్తూ ఉంటారు. వేసవి కాలంలో పనులకు రేట్లు పెంచి ఇచ్చే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం 2024 మార్చి నెల నుండి శ్రీకారం చుట్టింది. రూ.300 వరకు కూలీ చెల్లిస్తున్నామంటూ ప్రభుత్వం, అధికారులు చెబుతున్నారు. ఐతే ప్రస్తుతం ఈ పథకం ద్వారా మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి, తాళ్ళూరు, తదితర గ్రామాల్లో పనులు చేస్తున్నారు. ఆ చేసిన పనులకు రోజుకు రూ.150 నుండి 200 మాత్రమే చెల్లిస్తున్నారు. పనికి వేతనం చెల్లిస్తున్నా మంటూ చెబుతున్న అధికారులు ఈ విధంగా చెల్లించడం పట్ల కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ పని చేసినా కూలీ తక్కువ ఇస్తున్నారని వాపోతున్నారు. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కై పనికి రానివారికి కుడా మస్తర్లు వేయడంతో తాము చేసిన పనిని కుడా వారి ఖాతాలో వేస్తున్నారని, దీంతో మా కూలీ తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనులపై దృష్టి సారించి తమదే రాజ్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

బి-ఆర్క్, బి-ప్లాన్లో తిరుమల విద్యార్థులు అద్భుత ఫలితాలు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : ప్రతిష్టాత్మక జె.ఇ.ఇ. (మెయిన్) బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. బి. ప్లానింగ్ విభాగంలో ఒపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 1వ ర్యాంకు సాధించి మరోసారి సత్తా చాటారన్నారు. కె. సాకేత్ ప్రణవ్ ఒపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 1వ ర్యాంకు, వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో తమ విద్యార్థులు కె. జె. వెంకట సాయి 2వ ర్యాంకు, పప్పుల దినేష్ 8వ ర్యాంకు, కె.వి. సత్య నీలచలం 8వర్యాంకు, యమ్.ఎన్. మణికంఠ 15వ ర్యాంకు, యమ్.జి. వెంకట మహేష్ 15వ ర్యాంకు, జి.ఎస్.వెంకట సాయి కృష్ణ18వ ర్యాంకు, ఎన్. రాజీవ్ 20వ ర్యాంకు సాధించడంతో పాటుగా 23,24,25,26,31,32,36,40,44,50 .ర్యాంకులు సాధించారని ఆయన తెలియజేశారు. బి. ఆర్క్ విభాగంలో వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తాటిపాక ఆదిత్య 4వ ర్యాంకు, కె. సాకేత్ ప్రణవ్5వ ర్యాంకు, కె. జె. వెంకట సాయి 5వ ర్యాంకు, పప్పుల దినేష్ 14వ ర్యాంకు, జి.ఎస్. వెంకట దుర్గాసాయి 17వ ర్యాంకు సాధించడంతో పాటుగా 21,27,35,36,40,43 ...... ర్యాంకులు సాధించారని ఆయన తెలియజేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి. సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి. శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం

విశాలాంధ్ర-కొవ్వూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఐసిటిసి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినాన్ని నిర్వహించారు. మనం హెచ్ఐవి - ఎయిడ్స్తో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్లప్రేమ, సంఘీభావం తెలియచేద్దాం - అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుభాషిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం 1983లో ప్రారంభమై ప్రతి ఏడాది మే నెల మూడో ఆదివారం 115 దేశాలలో సుమారు 1200 కమ్యూనిటీ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ తో జీవిస్తున్న వారికి మేమున్నాము అనే భరోసా ఇవ్వడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మన ఆంధ్రప్రదేశ్లో హెచ్ఐవి, ఎయిడ్స్ తో గత 20 సంవత్సరంలో లక్షా నలభై ఐదు వేల మంది మృతి చెందారని అన్నారు. సుమారు రెండు లక్షల ఇరవై రెండు వేల మూడు వందల మంది ఎస్.ఆర్.టి మందులు వాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్నారని అన్నారు. వారికి అన్ని విధాల ఔషధ చికిత్స ఉచిత మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి బాధితులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ ఏ సి టి 2017 ను అమల్లోకి తీసుకుని వచ్చిందని అన్నారు. దీని ద్వారా హెచ్ఐవి తో బాధపడుతున్న బాధితులకు న్యాయం జరిగేలా చేసేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవి,ఎయిడ్స్ సంబంధిత శాఖల ద్వారా పనిచేస్తున్నారయన్నారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించడంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కే. దాస్ బాబు, రాజ్ మేరీ, ఎస్. లలిత కుమారి,లక్ష్మీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : నగర పంచాయతీ పరిధిలోని పెద్ద వంతెన సమీపంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహో త్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ గణేష్ కూరగాయల వర్తక సంఘం వారి ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచరణల నడుమ శాస్త్రోక్తకంగా జరిగింది. అనంతరం ఆలయ వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.